పోలీస్ అభ్యర్థుల
చలో ప్రగతిభవన్ విజయవంతం

- ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన చలో ప్రగతిభవన్ విజయవంతమైంది. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు కదిలారు. అయితే, ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు, నిర్బంధాలతో పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా కార్యక్రమం విజయవంతం అయిందని పోరాట సమితి నేతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన, విద్యార్థి సంఘాల నేతలను.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులను సుమారు 1000మందిని అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి పిలుపునిచ్చింది.

ప్రగతి భవన్‌కు ర్యాలీగా తరలిన నేతలను హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో అరెస్టు చేసి గోషామహల్ స్టేడియానికి తరలించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నర్సింహా, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ గోషామహల్ స్టేడియానికి వెళ్లి అక్కడ యువజన, విద్యార్థి సంఘాల నేతలను, అభ్యర్థులను పరామర్శించారు. అరెస్టులను తీవ్రంగా ఖండించారు.

పోలీస్ అభ్యర్థుల ఎంపిక పద్ధతిలో తప్పులను సవరించి న్యాయం జరిగేలా చూడాలని చేపట్టిన చలో ప్రగతిభవన్‌కు వెళ్లకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందులో యువజన, విద్యార్థి సంఘాల నేతలను

అభ్యర్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పోలీసులు అడ్డుకున్నారు. అర్ధరాత్రి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నేతలు కాలంగి హరికృష్ణ, బయ్య అభిమన్యు, పరిటాల వేణు, హైమద్, గణేష్‌ను అరెస్టు చేశారు. దమ్మపేటలో ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి బత్తుల సాయి, ఎఐవైఎఫ్ దమ్మపేట మండల కార్యదర్శి సుంకుపాక ధర్మను ముందస్తుగా అరెస్టు చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ నాయకులను పోలీసులు తెల్లవారుజామునే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో యూత్ కాంగ్రెస్ నాయకులను, మండల కేంద్రంలోని బస్టాండ్‌లో డీవైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో చెన్న రాజేష్, బోనగిరి గణేష్,గాడిపల్లి ప్రశాంత్, పాసికంటి ఉదయ్ ఉన్నారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో పిడిఎస్‌యు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పోలేబోయిన కిరణ్‌కుమార్ ఉన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, నాయకులకు పోలీసులు అరెస్టు చేసి 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. నారాయణపేట్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు శశికిరణ్, నరేష్, పవన్ కుమార్, వెంకటేష్, శ్రీనివాస్‌ను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. అచ్చంపేటలో జిల్లా అధ్యక్షులు వర్ధం సైదులును అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర బాధ్యులు కె.ధర్మేంద్ర, నిర్లకంటి శ్రీకాంత్, సత్య ప్రసాద్(ఏఐవైఎఫ్), అనగంటి వెంకటేష్, జావీద్ (డివైఎఫ్ఐ), సలీంపాషా(వైజేఎస్), రెహ్మాన్, ఉదయ్(ఎఐఎస్ఎఫ్), నాగరాజు, అశోక్‌రెడ్డి, సునీల్ (ఎస్ఎఫ్ఐ), అరుణ్ కుమార్ (విజేఎస్), శ్రీకాంత్ (నిరుద్యోగ జాక్) మాట్లాడారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టిఎస్ఎల్‌పీఆర్‌బీ) వల్ల ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా పోరాటాలు నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థుల పట్ల ఉదాసీనత చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి బాధ్యులను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. సత్వరమే ఉన్నత స్థాయి కమిటీని నియమించాలన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని, పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు.

ఆర్‌టిసిని ప్రయివేటుపరం చేయబోం

- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఆర్‌టిసి 'జీవా' వాటర్ బాటిళ్లను విడుదల చేసిన మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఆర్‌టిసి ప్రజల ఆస్తి అని, పేద, మధ్య తరగతి వాళ్లు వినియోగించే ఈ సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రయివేటుపరం చేయబోదని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో టిఎస్ఆర్‌టిసి సొంత బ్రాండ్ 'జీవా' వాటర్ బాటిళ్లను సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, టిఆర్అండ్‌బి శాఖ కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్‌టిసి ఎండీ వి.సి.సజ్జనార్‌తో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఏటా టిఎస్ఆర్‌టిసి 90 లక్షల లీటర్ల వాటర్ బాటిళ్లను బయట నుంచి కొని వినియోగించడం జరుగుతోందని, ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. టిఎస్ఆర్‌టిసిలో దాదాపు 50 వేల మంది సిబ్బందిని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తోందని చెప్పారు. సంస్థ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తరువాత 20 నుంచి 25 డిపోలను లాభాల బాటలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో అన్ని డిపోలు లాభాల్లోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ 9 వేల బస్సులు 33 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ 30 లక్షల మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు ఆర్‌టిసి చేర్చుతోందని వివరించారు. టిఎస్ఆర్‌టిసి సొంత బ్రాండ్‌తో మార్కెట్‌లోకి వస్తున్న స్వచ్ఛమైన తాగునీరు 'జీవా'ను ప్రజల ఆదరించాలని మంత్రి కోరారు.

టీఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. తాగునీటి వ్యాపారంలోకి టిఎస్ఆర్‌టిసి ప్రవేశించడం గొప్ప ఆలోచన అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. టిఎస్ఆర్‌టిసికి రెవెన్యూ 96 శాతం టికెట్ల ద్వారానే వస్తోందన్నారు. గతంలో కన్నా ఆక్యుపెన్సీ రేటు ఇప్పుడు పెరిగిందని.. అయినా ఇంకా సాధించాల్సి ఉందన్నారు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్తున్నామని తెలిపారు. కార్గో సేవల ద్వారా మూడేండ్లలో రూ.200 కోట్ల రాబడి వచ్చిందని.. 34 పెట్రోల్ బంకుల ద్వారా రోజుకు రూ.90 లక్షల బిజినెస్ నడుస్తోందని వెల్లడించారు. త్వరలోనే 250 ఎం.ఎల్, అర లీటర్ బాటిళ్లను మార్కెట్‌లోకి తీసుకొస్తామని చెప్పారు. టిఎస్ఆర్‌టిసి వృద్ధికి సహకరిస్తున్న హన్సా ఈక్విటీ పార్ట్‌నర్ ఎల్ఎల్‌పీ త్రినాథ్‌బాబును అభినందించారు.

జీవా వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తీసుకురావడంలో తమవంతు కృషి చేసిన సంస్థ ఉన్నతాధికారులు ప్రస్తుత సి.పి.ఎం కృష్ణకాంత్, సి.టి.ఎం (ఎంఅండ్‌సి) విజయకుమార్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ విప్లవ్, ఎస్.ఒ శ్రవంత్ తదితరులను సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ముని శేఖర్, పురుషోత్తం, యాదగిరి, వినోద్‌కుమార్, సీటీఎం జీవన్ ప్రసాద్, రేగుల సునీల్, రంగారెడ్డి, హైదరాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల కాంతారెడ్డి మరణం పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సిపిఎం ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు ఉప్పల కాంతారెడ్డి సోమవారం మునగాలలో మరణించారు. వారి మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం బాధాకరమని పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఎన్నో నిర్బంధాలను, జైలు జీవితాలను అనుభవించారని తెలిపారు. జమీందారులకు వ్యతిరేకంగా ఆయన అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. భూమిలేని పేదలనీ కూడగట్టి ఎన్నో భూ పోరాటాలు నిర్వహించారని తెలిపారు. అనేక గ్రామాల్లో పేదలకు భూములు పంచారని పేర్కొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సిపిఎంను బలోపేతం చేశారని గుర్తుచేశారు. కాంతారెడ్డి 2001 వరకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేస్తూ, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కాంతారెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటనీ, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది.

సి సెక్షన్లు తగ్గించేందుకు కృషి చేయాలి

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనవసర సి సెక్షన్లు తగ్గించేందుకు సిబ్బంది కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. సోమవారం టివివిపి ఆస్పత్రుల నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. పేషెంట్లు, అటెండర్లతో దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రులపై పెరిగిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. అనవసర సి సెక్షన్ల వల్ల కలిగే నష్టాన్ని కౌన్సెలింగ్ ద్వారా వివరించాలని కోరారు. చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో పేషెంట్లకు వార్డుల్లో కిటికీలు, తలుపులు సరిగ్గా ఉన్నాయా లేదా చూడాలని ఆదేశించారు. మందులు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రిఫర్ చేయకూడదని, డిశ్చార్జ్ అయిన పేషెంట్లకు మందులు ఇచ్చి పంపాలని ఆదేశించారు.

అగ్నివీర్‌లకు శిక్షణ షురూ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ లోని ఆర్‌టిలరీ సెంటర్‌లో అగ్నివీర్ల మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమైంది. జనవరి ఒకటో తేదీ నుంచి చారిత్రక గోల్కొండ కోట పరిసరాల్లో ఉన్న 1,900 ఎకరాల గ్యాలరీలో వీరు శిక్షణ పొందుతున్నారు. మొదటి బ్యాచ్‌లో 2,265 మందికి మొదలైన శిక్షణ 31 వారాల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ శిక్షణలో రాజ్యాంగం, సైబర్ భద్రతకు సంబంధించిన ప్రాథమిక అంశాలు, రైఫిల్ ఫైరింగ్, సైన్యానికి సంబంధించిన కమ్యూనికేషన్ తదితర విషయాలను వీరు అభ్యసించనున్నారు. కమాండెంట్ ఆర్‌టిలరీ సెంటర్ బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ, శిక్షణలో ఆధునాతన సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

డిజిపికి రేవంత్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ ఫిరాయించిన 12మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని బృందం సోమవారం హైదరాబాద్‌లో డిజిపిని కలిసింది. నాగర్ కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలపై బిఆర్ఎస్ నాయకులను దాడులపై ఫిర్యాదు చేసింది. గొంతుపై కాలుపెట్టి తొక్కి పరుష పదజాలంతో దూషించారని పేర్కొంది. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు పెడతారని భావించామనీ, కానీ తమ పార్టీ నాయకులు నాగం జనార్దన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టారని రేవంత్ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు నిరసనగా ఈనెల 17న దళిత గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని చెప్పారు.

పాదయాత్రకు జెండా ఊపుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఆర్‌టిసి కార్మికుల పోరాటానికి ప్రజాప్రతినిధుల మద్దతు ఇవ్వాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి సంస్థను కాపాడుకోవాలంటే అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు కార్మికుల పోరాటానికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. చౌటుప్పల్ నుంచి ధర్నాచౌక్ వరకు మూడ్రోజుల నుంచి ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన పాదయాత్ర సోమవారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్ డిపో వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాల్గొని కార్మికులకు మద్దతుగా నిలుస్తున్నట్టు ప్రకటించారు. ఆర్‌టిసి కార్మికులకు రావాల్సిన పిఆర్‌సి ఇవ్వాలని, సంస్థలో కార్మిక సంఘాలను పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బిఆర్ఎస్‌కు ఎన్నికల్లో కమ్యూనిస్టులు మద్దతు ఇచ్చినా.. ప్రజాసమస్యలపై పోరాడటంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, రాష్ట్ర కార్యదర్శి బాలరాజు, ఉపాధ్యాక్షుడు చంద్రయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జీఆర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎవి రావు, చంద్ర ప్రకాశ్, అచ్చాలు, రవీందర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రచారి, సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవంతిపురంలో మౌలిక వసతులు కల్పించాలి

- జంగాలకాలనీని సందర్శించిన జూలకంటి
- ఆర్‌డిఒ కార్యాలయం వరకు పాదయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని అవంతిపురంలో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ముందుగా జంగాల కాలనీని జూలకంటి సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి వీధి తిరుగుతూ మౌలిక వసతులపై ఆరాతీశారు. జంగాల వారు చిన్నచిన్న గుడిసెలు వేసుకొని జీవనం గడుపుతూ ఎన్నో ఇబ్బందులెదుర్కొంటున్నారు. ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో వృథాగా ఉన్న పదివేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్‌ను ఎక్కి పరిశీలించారు. అక్కడి నుంచి మిర్యాలగూడలోని ఆర్‌డిఒ కార్యాలయం వరకు సుమారు ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. కాలనీ ప్రజలు ఖాళీ బిందెలు నెత్తిపై పెట్టుకొని పాదయాత్రగా బయలుదేరారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ చెన్నయ్యకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. అవంతిపురంలో రోడ్లు, డ్రయినేజీ, వీధిదీపాలు లేక ప్రజలు దుర్భర పరిస్థితిలో గడుపుతున్నారని వాపోయారు. జంగాల, కొత్తకాలనీలు అడవిని తలపించే విధంగా ఉన్నాయన్నారు. చిన్న చిన్న గుడారాలు ఏర్పాటు చేసుకుని

బిందెలు తలపై పెట్టుకొని నిరసన తెలుపుతున్న మహిళలు

నివాసముంటున్నారని, రాళ్ల రప్పల మధ్య జీవనం గడుపుతున్నారని తెలిపారు. వీధిదీపాలు, విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాము కాటుకు ఇద్దరు మృతిచెందారని గుర్తు చేశారు. మంచినీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని, ప్రత్యేకంగా వేలాది రూపాయలు ఖర్చుపెట్టి పైపుల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారన్నారు. రెండు నియోజకవర్గాలకు మంచి నీరందించే ట్రీట్‌మెంట్ ప్లాంట్ గ్రామ సమీపంలో ఉన్నప్పటికీ జంగాలకాలనీకి నీరందడం లేదని వాపోయారు. ఎన్నో ఏళ్లుగా అక్కడే జీవిస్తున్న వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే గ్రామాన్ని సందర్శించి, జంగాల కాలనీలో మౌలిక వసతులు కల్పన కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి,అయ్యూబ్, తిరుపతి రామ్మూర్తి, వేములపల్లి వైస్ఎంపిపి పాదూరి గోవర్ధన, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సచివాలయం ప్రారంభం 18న లేనట్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 18న చేపడతామని గతంలో సిఎం కెసిఆర్ ప్రకటించినా, సచివాలయం పనులు ఇంకా పూర్తికాలేదు. తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సచివాలయం ప్రారంభోత్సవం వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే రోజున ఖమ్మంలో బిఆర్ఎస్ ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. దాదాపు లక్ష మందిని సమీకరించడం ద్వారా సత్తా చాటాలని భావిస్తున్నారు. ఈ సభకు కేరళ సిఎం పినరయి విజయన్, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సిఎం భగవంత్‌మాన్‌ను ఆహ్వానించారు. అలాగే యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్, కర్నాటక మాజీ సిఎం కుమార స్వామిని సైతం పిలిచారు. కొత్త సచివాలయం పనులు వేగంగా సాగుతున్నా, ఈనెల 18 నాటికి పూర్తయ్యే అవకాశం లేదని అధికారిక సమాచారం. సీఎం, చీఫ్ సెక్రటరీ, మంత్రుల చాంబర్ల పనులు దాదాపు పూర్తికావస్తున్నా, మిగతా ఐఎఎస్, ఇతర ముఖ్య అధికారుల ఛాంబర్లు, కార్యాలయాలు, యాంటి రూమ్‌లు, మీటింగ్ హాళ్ల పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఈనేపథ్యంలో సచివాలయం ప్రారంభోత్సవం ఈనెల 18న దాదాపుగా జరగకపోవచ్చని తెలిసింది.

నిరవధిక సమ్మె చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

హాస్టల్ డైలీవేజ్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

- ఇవ్వకుంటే పండుగ తర్వాత కూడా సమ్మె కొనసాగిస్తాం
- సిఐటియు జిల్లా నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై విక్రమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడేళ్లుగా రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించకపోతే సంక్రాంతి పండుగ అనంతరం ఏక్షణానైనా నిరవధిక సమ్మె చేస్తామని సిఐటియు జిల్లా నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై విక్రమ్ హెచ్చరించారు. మూడేండ్లుగా తమకు రావాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీవేజ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంనగరంలోని ఎన్ఎస్టీ రోడ్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక నెల జీతం రాకపోతేనే తీవ్ర ఆర్థిక ఇబ్బందులూ పడే పరిస్థితిల్లో మూడేండ్ల జీతాలు ఇవ్వకపోతే వారు ఎంతో దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారన్నారు. జీతాలకు సంబంధించిన చెక్ ఫైనాన్స్ అనుమతి కోసం ఉందని కొంతకాలంగా అధికారులు చెబుతూ కార్మికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయకపోతే సంక్రాంతి పండుగ అనంతరం సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు నేతలతో డిడి చర్చలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు బోడపట్ల సుదర్శన్, కాంపాటి వెంకన్న, బాదావత్ లక్మా, మల్లికార్జున్, జె వెంకన్న బాబు, ప్రవీణ్, పి వాసు, సంతోష్, లక్ష్మి దేవి, వీరమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రన్నింగ్ క్వాలిఫై అయిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులను మెయిన్స్‌కు అనుమతించాలని ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులు దుర్మార్గం, అర్ధరాత్రి ఇండ్లలో వెళ్ళి అరెస్టులు చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ రాష్ట్ర కమిటీలు ఖండించాయి. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనంగటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు.రన్నింగ్‌లో క్వాలిఫై ఐన పోలీసు అభ్యర్థులందరికి మెయిన్స్ అర్హత కల్పించాలని కోరుతూ గత రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం విద్యార్థి ,యువజన సంఘాలు ఛలో ప్రగతిభవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. స్పందించకపోగా, ఆందోళనకు పూనుకున్న నాయకులను అర్ధరాత్రి నుంచే రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసి హైదరాబాద్ రాకుండా అడ్డుకోవడం హేయమైన చర్య అని విమర్శించారు. పాత పద్ధతుల్లో ఈవెంట్స్ నిర్వహించకపోవడం, రన్నింగ్ క్వాలిఫై అయినా ప్రధాన పరీక్షకు అనుమతించకపోవడం వంటి చర్యలతో చాలా మంది నిరుద్యోగులు తమ జీవితాలను నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోమవారం మంచిర్యాల జిల్లాలో పుప్పాల రవికుమార్ అనే అభ్యర్థి ఆత్మహత్య చేసుకుని చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర హోంమంత్రి, పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు చైర్మెన్, డిజిపి అభ్యర్థులతో చర్చలు జరిపి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను, ప్రగతి భవన్ ముట్టడిలో అరెస్ట్ అయిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల భవిష్యత్ పోరాటాలకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నిలబడతాయని మద్దతుగా నిలబడుతుందని స్పష్టం చేశారు.

రాష్ట్రంపై చలి పంజా

- మరో రెండ్రోజులు ఇదే పరిస్థితి
- వేగంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- కోహిర్‌లో 4.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- 31 జిల్లాల్లో పది డిగ్రీలలోపే కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చలి వణుకు పుట్టిస్తున్నది. ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. 31 జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల లోపే నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతున్నది. ఆ జిల్లాలన్నీ ఆరెంజ్ హెచ్చరిక జాబితాలో ఉన్నాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుతున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రతల కంటే ఒకేసారి మూడు నుంచి ఐదు డిగ్రీల మేర పడిపోయాయి. ఉదయం పది దాటినా చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. దీంతో ఇంటి తలుపులు తీయలేని పరిస్థితి నెలకొంది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 4.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

ఈ ఏడాది ఇదే అత్యల్పం కావడం గమనార్హం. సంగారెడ్డి, రంగారెడ్డి, కామారెడ్డి, కొమ్రంభీమ్ అసిఫాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు(ఆరు డిగ్రీల లోపు)

నమోదయ్యాయి. రాష్ట్రంలో మరో రెండ్రోజుల పాటు చలితీవ్రత ఇదే స్థాయిలో ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఈశాన్య దిశ నుంచి తెలంగాణ మీదుగా కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయనీ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చల్లని గాలులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆస్తమా, శ్వాసకోసవ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. కోహిర్(సంగారెడ్డి)4.6 డిగ్రీలు, సిర్పూర్(యూ) (కొమ్రంభీం అసిఫాబాద్) 4.8 డిగ్రీలు, మర్పల్లి (వికారాబాద్) 5.0 డిగ్రీలు, తాళ్లపల్లి (రంగారెడ్డి) 5.0 డిగ్రీలు, మంగల్‌పల్లి (రంగారెడ్డి) 5.2 డిగ్రీలు, బజార్‌హత్నూర్ (ఆదిలాబాద్) 5.4 డిగ్రీలు, డోంగ్లి(కామారెడ్డి) 5.5 డిగ్రీలు, శివంపేట్(మెదక్)5.6 డిగ్రీలు, న్యాల్‌కల్ (సంగారెడ్డి) 5.6 డిగ్రీలు, నల్లవెల్లి (సంగారెడ్డి) 5.7 డిగ్రీలు నమోదయ్యాయి.

మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

- అదనపు డిజి శిఖాగోయల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధవహిస్తామని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డిజిగా నియమితులైన శిఖాగోయల్ అన్నారు. డిజిపి కార్యాలయం సమీపంలోని తమ కార్యాలయంలో ఆమె సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ తాను హైదరాబాద్ నగర అదనపు పోలీసు కమిషనర్‌గా పనిచేసిన సమయంలో, షీ టీమ్స్, భరోసా కేంద్ర ఇన్‌ఛార్జిగా ఉన్న సమయంలో మహిళల భద్రత, కాలేజీ విద్యార్థినుల రక్షణ పట్ల పలు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

సిఐడి డిజిగా బాధ్యతలు చేపట్టిన మహేష్ భగవత్

రాష్ట్ర సిఐడి విభాగం అదనపు డిజిగా మహేష్ భగవత్ సోమవారం బాధ్యతలను చేపట్టారు. లక్డీకాపూల్‌లోని డిజిపి కార్యాలయం మూడవ అంతస్తులో గల తన చాంబర్‌లో భగవత్ నూతన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సిఐడి విభాగం ప్రతిష్టను పెంచడానికి పూర్తిగా కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఆయన తన అధికారులతో సమావేశమై సిఐడి ఇప్పటి వరకు నిర్వహిస్తున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకుందాం

- ఆర్‌టిసి ఎమ్‌డి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజారవాణా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీదా ఉన్నదని ఆర్‌టిసి ఎమ్‌డి సజ్జనార్ అన్నారు. తెలంగాణ ఆర్‌టిసి అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే అద్దె బస్సుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆర్‌టిసికి వారితో సంబంధాలను మరింత మెరుగుపరచడానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఆర్‌టిసికి 30 శాతం అద్దె బస్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. రాబోయే సంక్రాంతికి ప్రయాణికులకు మెరుగైన సేవలందించి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. తెలంగాణ ఆర్‌టిసి అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అబ్బ మధుకర్ రెడ్డి, వి.మహిపాల్ రెడ్డి మాట్లాడారు. పల్లె వెలుగు సర్వీసులో నడుస్తున్న ఆర్‌టిసి అద్దె బస్సులకు సంస్థ చెల్లించే అద్దెలో కిలోమీటర్‌కు రూపాయి తగ్గించకూడదని విజ్ఞప్తి చేశారు.

సెర్ప్ పేస్కేలు జిఒ విడుదల చేయాలి

- కేలండర్ ఆవిష్కరణలో మంత్రి ఎర్రబెల్లికి ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ పేస్కేలు జిఒను వెంటనే విడుదల చేయాలని సెర్ప్ ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మినిష్టర్స్ క్వార్టర్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సెర్ప్ ఉద్యోగ సంఘాల కేలండర్‌ను మంత్రి ఎర్రబెల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు కుంట గంగాధర్‌రెడ్డి, సుదర్శన్, జానయ్య, సుభాష్, వెంకట్ మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. సెర్ప్ ఉద్యోగులకు ముఖ్య మంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు పేస్కేల్ ఫైల్ ప్రాసెస్ మొత్తం పూర్తి చేసిందుకు ధన్యవాదాలు తెలిపారు. జీవోను కూడా తొందరగా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. 23 ఏండ్లుగా నామమాత్రపు ఉద్యోగ భద్రతతో, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కౌన్సిలింగ్ నిర్వహించడం, బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ ఇంక్రిమెంట్స్ ఇవ్వడం, తదితర అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రికి సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ..సెర్ప్ ఉద్యోగుల పేస్కేలు జీఓకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, అదేవిధంగా పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులతో సంప్రదింపులు నిర్వహిస్తామని హామీనిచ్చారు.

ప్రమాదాలకు డ్రైవర్లే బాధ్యులంటే ఎలా?

- ఆర్‌టిసిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది
- కేంద్రం కంటె తామేమీ తక్కువకాదన్నట్టు రాష్ట్ర సర్కారు తీరు
- ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి
- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వీరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

సంఘర్ష యాత్రలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కేంద్రంలోని బిజెపి సర్కారు తీసుకొచ్చిన మోటార్ వాహన చట్టం డ్రైవర్లకు ఉరితాడులా మారింది.. రోడ్లు బాగు చేయకుండా, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకుండా ప్రమాదాలకు డ్రైవర్లనే బాధ్యులను చేయడం సరికాదు" అని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వీరయ్య, ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్‌టిసిని పరిరక్షించాలని, ప్రతి మండల, జిల్లా కేంద్రంలో అడ్డా స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై చేపట్టిన 'సంఘర్ష' యాత్ర తొమ్మిదవ రోజుకు కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌కు చేరుకుంది. అక్కడి నుంచి శంకరపట్నం మండల కేంద్రం మీదుగా అల్గునూర్, జిల్లా కేంద్రంలోని జడ్‌పి కార్యాలయం వరకు వాహనాల ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం యాత్ర వేములవాడ, అక్కడి నుంచి సిరిసిల్లకు చేరుకుంది. ఆ తర్వాత ఎల్లారెడ్డిపేట, కామారెడ్డి మీదుగా రాత్రిక నిజామాబాద్‌కు చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో వీరయ్య, పుప్పాల శ్రీకాంత్ మాట్లాడారు. ఉన్నత చదువులు ఉన్నా.. ఉద్యోగాలు దొరక్క రవాణా రంగంలో చాలా మంది స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు.

నిత్యం ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లు గడిచినా వివిగిరి నేషనల్ ఇనిస్టిట్యూట్ సంస్థ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం అక్కడ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. రాష్ట్రంలో కూడా ఆ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోటార్ వాహన చట్టం, రవాణా రంగాన్ని సరళీకరణ చేయడంతో ప్రమాదాల రేటు తగ్గకపోగా పెరుగుతోందన్నారు. పెనాల్టీలు, కేసులు లాంటి చర్యలతో ప్రమాదాలను తగ్గిస్తామని సర్కారు చెప్పటం ఒక బూటకమని అన్నారు. కార్మికులకు, ప్రజలకు నష్టం కలిగించే అనేక అంశాలు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అద్దె బస్సుల సంఖ్య పెంచుతూ ఆర్‌టిసి ప్రయివేటుపరం చేస్తున్నారని, మనందరమూ ఆ సంస్థను పరిరక్షించుకోవాలని కోరారు. ఆర్‌టిసిలో 2019 నుంచి కార్మిక ఉద్యమంపై రాష్ట్ర సర్కారు ఆంక్షలు విధించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాని కంటే తామేమీ తక్కువ కాదన్నట్టుగా వ్యవహరించిందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షులు యు శ్రీనివాస్, గుడికందుల సత్యం, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యుఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రాజయ్య, కార్యదర్శి వీరగోని శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్టు జిల్లా సహాయ కార్యదర్శి పుల్లెల మల్లయ్య, ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు పాల్గొన్నారు.

నర్తకీమణులకు అభినందన సత్కారం

ప్రజాశక్తి - కల్చరల్

రాబోయే సంక్రాంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ నిర్వహణలో ఆలయ ప్రాంగణంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన జరిగింది. ఎస్ఎల్‌బి నృత్య అకాడమీ నుంచి ఉష రాణి, ప్రీతి, గుంగ్రు అకాడమీ నుంచి ప్రియ, జానపద నృత్య కళాకారిణి సంధ్యలు నాట్య అంశాలు ప్రదర్శించారు. సంస్థ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి వీరికి డాన్సర్ ఆఫ్ ఎక్సిలేన్సీ బిరుదుతో బాల గాయని హరిణిని సత్కరించారు. ఇదే వేదికపై కోవిడ్ సమయంలో సేవలు అందించిన శేషగిరి రావును మానవతా వాది బిరుదుతో ఎస్‌బిఐ విశ్రాంత అధికారి సాలూరి ప్రసాదరావు బహుకరించారు. వేదికపై గాయని కామేశ్వరి, న్యాయవాది రాజేశ్వరి, సత్య ప్రకాష్, సుబ్రహ్మణ్యం ఒఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విఐపిలు మాత్రమే రావాలి

- బిఆర్ఎస్ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి దయాకర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిత్య నూతనంగా ఉండాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 12న ముఖ్యమంత్రి కెసిఆర్ పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపి, పార్టీ జిల్లా అధ్యక్షులు మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు, బిఆర్ఎస్ నాయకులు పార్టీ కార్యాలయాన్ని, కలెక్టరేట్‌ను పరిశీలించారు. మంత్రి దయాకర్ రావు దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ కార్యాలయంలో కిటికీలు, తలుపులకు కర్టెన్ ఏర్పాటు చేయాలని వేదికపై పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, ముఖ్యమైన విఐపిలు మాత్రమే పార్టీ కార్యాలయానికి రావాలని సూచించారు. కార్పెట్లు, కుర్చీలు వేయాలని సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. మొత్తం కార్యాలయానికి, కలెక్టరేట్‌ను విద్యుద్దీపాలతో సుందరంగా తయారు చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు పలు సూచనలు చేశారు. అధికారులందరూ ప్రధాన శాఖల సిబ్బంది, కార్యకర్తలు, నాయకులు అందరూ కలెక్టరేట్ వద్దనే ఉంటారని తెలిపారు. ప్రధానంగా వాష్ రూమ్‌లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే సీఎం హెలిప్యాడ్ స్థలాన్ని నాలుగు చోట్ల అధికారులు పరిశీలించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, వన్యప్రాణుల సంరక్షణ డైరెక్టర్ బానోత్ రవికుమార్, జెడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ మూల మధూకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూములు దక్కేదాకా పోరు

- తెలంగాణ వచ్చినా వలసదారులదే పెత్తనం
- ఆదివాసీ పోరుగర్జనలో సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీకాంత్ స్మిత

ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏజెన్సీ భూములు గిరిజనుల హక్కని, తమ భూముల్లో తామంతా కూలీలుగా పని చేస్తున్నామని, తమ భూములు దక్కేవరకు ఆదివాసులందరూ ఐక్యంగా పోరాడాలని సుప్రీంకోర్టు న్యాయవ్యాది శ్రీకాంత్ స్మిత పిలుపునిచ్చారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని దేవస్థానం మైదానంలో ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో శ్రీకాంత్ స్మిత పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులు అడవిని నమ్ముకుని, ఆ ఉత్పత్తులే ఆధారంగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఏజెన్సీలోని ఖనిజసంపద, వనరులను వలస దారులు దోచుకుంటుంటే అడవులను రక్షిస్తున్న గిరిజనులను అక్రమదారులుగా పాలకులు ముద్రవేస్తున్నారని అన్నారు. వారిని అడవులనుంచి వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో గిరిజనులకోసం ఉన్న చట్టాలను పాలకులు అమలు చేయాలన్నారు. అనంతరం ఎఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కోర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ.. ఏజెన్సీలో వలస గిరిజనేతరుల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం ఏజెన్సీలో ఏర్పాటు చేస్తున్న ఇసుక రీచ్‌ల్లో గిరిజనులు కూలీలుగా బతుకుతున్నారన్నారు. ఎండల్లో పనిచేస్తున్న గిరిజనులకు రూ.40 ఇస్తూ రేజింగ్ కాంట్రాక్టర్లకు రూ.140 కట్టబెడుతున్నారన్నారు. ఇసుక రీచ్‌ల్లో 50 శాతం గిరిజనులకు చెందేలా చూడాలన్నారు. ఏజెన్సీలో గ్రామసభ్యులు ముఖ్యమని గ్రామసభల కోసం రేజింగ్ కాంట్రాక్టర్లు స్నేహ భావంగా ఉంటున్న గిరిజన ప్రజలను రెండుగా చీల్చుతున్నారని గుర్తు చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి 45 రోజులుగా గిరిజన గ్రామాల్లో ఎఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కోర్సా నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పర్యటించినట్టు తెలిపారు. గిరిజన చట్టాలను వారికి తెలిసే విధంగా అవగాహన కల్పించేందుకు సభ ఏర్పాటు చేయడం మంచి పరిణామమని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వీరమల్లు అన్నారు. గిరిజన చట్టాలపై నాయకులు ముద్దరాజు వీరభద్రం, న్యాయవాది ఆనంద్ వివరించారు. అంతకుముందు కొమరంభీం విగ్రహం నుంచి సభాస్థలి వరకు ఆదివాసీ సాంప్రదాయ కొమ్ము నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ లాయర్ల సంఘం న్యాయవాది పాపారావు, సున్నం రమేష్, చింత సమ్మయ్య, ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్ఎస్‌పి చట్టాన్ని తేవడంలో కేంద్రం విఫలం

- ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేస్తామంటూ రాతపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ, దాన్ని అమలు చేయడంలో విఫలమైందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ విమర్శించారు. రైతులకు రెట్టింపు ఆదాయం వచ్చేట్టుగా చేస్తామన్న వాగ్ధానాన్ని విస్మరించిందని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు పెద్ద సంఖ్యలో చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులు బయట పడాలంటే, కనీస మద్దతు ధరల చట్టం చేయాలనీ, కేరళ తరహాలో రుణ విముక్తి చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగ ఆదాయం 2022 నాటికి రెట్టింపు చేస్తామనీ, 2016లో ప్రధాన మంత్రి మోడీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతుల ఆదాయం పెరగాలంటే, ప్రభుత్వం ముందుగా రైతు వ్యవసాయ ఖర్చులు తగ్గించాల్సిన అవసరముందని తెలిపారు. ఉత్పాదకతను పెంచి గిట్టుబాటు ధరలు ఇవ్వాలన్నారు. కనీస మద్దతు ధరల ప్రకారం పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో సుమారు 52 పంటలుకు మద్దతు ధర ప్రకటించాలంటూ విజ్ఞప్తులు వస్తున్నాయనీ, కేవలం 23 పంటలకే ప్రకటించి కేంద్రం చేతులు దులుపుకుంటున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపుల్లో భారీగా కోతలు విధించిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉపకరణాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపు స్థాయిలో పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. అన్నదాతలు అప్పులు తీర్చలేక ప్రతి ఏడాది 12,000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతాంగానికి ఆయా రాష్ట్రాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. జాతీయ స్థాయిలో సరైన విత్తన చట్టం ఇంతవరకు లేకపోవడంతో కల్తీ విత్తనాల సమస్య తీవ్రమైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న సేంద్రీయ వ్యవసాయంపై ఆధారపడితే శ్రీలంక తరహా ఆహార సంక్షోభం పరిస్థితులు వస్తాయని చెప్పారు. అధునాతన నూతన మార్కెట్ల విధానం విఫలమైందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రూపాయలు కురిపిస్తుండగా రైతాంగానికి ఏ విధంగానూ ఉపయోగపడటం లేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. 2011 కౌలు చట్టం ప్రకారం కౌలు దారులకు రుణార్హత కార్డులు ఇవ్వాలని కోరారు. రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు డబ్బులు, ధాన్యం అమ్మిన డబ్బులు బ్యాంకు అధికారులు పాత అప్పుల కింద జమ చేయకుండా రైతుల పెట్టుబడి కోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, పి.జంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, మాదినేని రమేష్, బుర్రి శ్రీరాములు, వీరేపల్లి వెంకటేశ్వర్లు, శెట్టి వెంకన్న, వర్ణ వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, లెల్లెల బాలకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, బొంతు రాంబాబు, దండ వెంకట్‌రెడ్డి, కున్‌రెడ్డి నాగిరెడ్డి, మాటూరి బాల్‌రాజ్‌గౌడ్, గఫూర్ పాషా, ఈసంపల్లి బాబు, రాపర్తి సోమయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, డి. బాల్‌రెడ్డి, యం శ్రీనివాసులు, పల్లపు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బిఎన్ జీవితం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

- ఎంసిపిఐ(యు) ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు భీమిరెడ్డి నరసింహారెడ్డి జీవితం ప్రజాఉద్యమాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నదని ఎంసిపిఐ(యు) ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ తెలిపారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సుందర విజ్ఞాన కేంద్రంలో "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తి రాజకీయ సామాజిక అంశాలపై బిఎన్ ప్రభావం"అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటంలో మడమ తిప్పని నాయకుడిగా పోరాటం నిర్వహించారని గుర్తుచేశారు. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన మహాత్తర పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన్ని స్మరించుకోవడమంటే కమ్యూనిస్టు ఉద్యమాన్ని, ప్రజా పోరాటాలను స్మరించుకోవడమేనని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యోధులు కందిమల్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, బిఎన్ జీవితాన్ని వేరుగా చూడలేమని తెలిపారు. ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ అందరికీ ఉద్యమాల దివిటీ బిఎన్ అని తెలిపారు.ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో ఉపేందర్ రెడ్డి, జస్టిస్ (రిటైర్డ్)చంద్ర కుమార్, బిఎల్ఎఫ్ చైర్మెన్ నల్ల సూర్యప్రకాష్, ఎస్‌యుసీఐ(ఎస్) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జేవి చలపతిరావు, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల కన్వీనర్ విమలక్క, ప్రజా గాయకులునరసన్న, కొత్తగట్టు మల్లయ్య, సుందరి జగన్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా తదితరులు ప్రసంగించారు.

రైతు ఆత్మహత్య

- సాగునీటి కోసం బోర్లు వేసి అప్పుల పాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంట పండించేందుకు సాగునీటి వసతి లేక బోర్లు వేయించగా.. అవి పడకపోవడంతో అప్పుల పాలై తీవ్ర మనస్తాపానికి గురై ఉరేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం బోనాల గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కప్ప సంగయ్య (45)కు గ్రామ సమీపంలో 1.20 ఎకరాల భూమి ఉంది. ఇందులో పంట సాగు చేసుకోవడానికి సాగునీరు లేకపోవడంతో గతేడాది అప్పులు చేసి మూడు బోర్లు వేశారు. అయినా నీళ్లు పడలేదు. ఒక్క బోరులో కొంచెం నీరు రావడంతో బోరు మోటర్ బిగించి పైప్ లైన్లు బిగించారు. ఇందుకోసం దాదాపు రూ.4 లక్షలకు పైగా అప్పయింది. ప్రస్తుతం ఆ బోరూ ఎత్తిపోవడంతో సంగయ్య తీవ్ర మనస్తాపానికి గురైయ్యాడు. ఒక వైపు అప్పులు పెరిగిపోతుండగా.. పంట పండించేందుకు ఉన్న బోరు వట్టిపోవడంతో ఆవేదనకు గురైయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. ఇంటిపెద్దను కోల్పోవడంతో కుటుంబీకుల రోదనలు అక్కడున్నవారిని కలిచివేశాయి.



ప్రదర్శనలో మాట్లాడుతున్న మంత్రి సబిత

ఆలోచనలకు పదును పెడితే అద్భుతాలు

- విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- నిర్మల్‌లో 50వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మేళా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల ఆలోచనలకు పదును పెడితే అద్భుతాలు సృష్టించొచ్చని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సెయింట్ థామస్ హైస్కూల్లో సోమవారం 50వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి, అటవీ, పర్యావరణ, న్యాయ, దేవదాయ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల్లో ఆలోచనలను రూపకల్పన చేయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని చెప్పారు. జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. శాస్త్ర సాంకేతికపరంగా అభివృద్ధి జరిగితే సమాజం మరింత ముందుకెళ్తుందన్నారు. తెలంగాణ ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని విద్యార్థులకు సూచించారు. సమాజానికి ఉపయోగపడే ఎన్నో ఆవిష్కరణలు చేయాలని బాల శాస్త్రవేత్తలను కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ విజయలక్ష్మి, ఖానాపూర్, ముధోల్ ఎమ్మెల్యేలు రేఖాశ్యాంనాయక్, విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన, ఎస్‌సిఇఆర్‌టి సంచాలకులు రాధారెడ్డి, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రిబుల్ ఐటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటరమణ, అదనపు కలెక్టర్లు రాంబాబు, హేమంత్ బోర్కడే, కొండాపూర్ సర్పంచ్ గంగాధర్, డిఇఒ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సుస్థిర ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి

- ఐటి ఉద్యోగాల కల్పనలో బెంగళూరును అధిగమించాం
- ఐటి పరిశ్రమ ప్రతినిధులతో ముఖాముఖిలో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుస్థిర ప్రభుత్వంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో అద్భుతంగా ఐటి పరిశ్రమ అభివృద్ధి చెందుతోందని చెప్పారు. దేశంలోని మొత్తం ఐటి ఉద్యోగుల్లో 20 శాతం హైదరాబాద్‌లోనే ఉన్నారని తెలిపారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని థ్రిల్ సిటీలో సోమవారం జరిగిన ఐటీ పరిశ్రమల ప్రతినిధుల ముఖాముఖి సమావేశానికి మంత్రి కెటిఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటీ రంగంలో ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌ను అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ హబ్ టి హబ్, మహిళా పారిశ్రామికవేత్తల కోసం వి-హబ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. టాస్క్ ద్వారా 7లక్షల మంది యువతకు నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ ఇచ్చామని వివరించారు.

పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత అనువైన నగరమని మంత్రి కెటిఆర్ చెప్పారు. ఐటీ రంగంలో లక్షలాది ఉద్యోగాలు కల్పించిందని, ఉద్యోగాల కల్పనలో బెంగళూరును హైదరాబాద్ దాటిందన్నారు. ఐటీలో గత రెండేళ్లలో కొత్తగా 40 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉత్తరంవైపు ఐటీ రంగాన్ని విస్తరిస్తున్నామన్నారు. ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లో కూడా ఐటి కార్యాలయాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అద్భుతంగా పనిచేస్తోందని కితాబిచ్చారు. తొలిరెండు స్పేస్‌టెక్ స్టార్టప్‌లు హైదరాబాద్‌కు చెందినవేనని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు హైదరాబాద్ వైపు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. తెలంగాణలో టీఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ అందిస్తామని వెల్లడించారు. బాసర ట్రిపుల్ ఐటి వంటి విద్యాసంస్థలతో కలిసి పనిచేయాలని కెటిఆర్ ఐటి సంస్థలను కోరారు. హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని హైసియా ప్రెసిడెంట్ మనీషా అన్నారు. పెట్టుబడులు పెట్టడానికి హైదరాబాద్ చాలా అనుకూలమైన ప్రాంతమని ఐటి శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పారు. ఐటీ రంగంలో గత రెండేండ్లలో 40 వేల కొత్త ఉద్యోగాలు వచ్చాయని, కరోనా సమయంలో ఐటీ ఇండస్ట్రీ అందించిన సహకారం మరువలేనిదని జయేశ్ రంజన్ పేర్కొన్నారు.

పత్తికి రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన పత్తికి రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి నాయకులతో మాట్లాడారు. సిసిఐ అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని మార్కెఫెడ్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

సిసిఐ అధికారులతో మాట్లాడి 11న సాయంత్రం 4గంటలకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ.. జిల్లాలో మద్దతు ధర లేకపోవడంతో రైతులు పత్తిని అమ్ముకోకుండా ఇండ్లలో నిలువ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు, సిసిఐ అధికారులు కుమ్మక్కై పత్తికి ధర కల్పించకపోవడంతో నిలువ చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. దళారుల ఒత్తిడితో అమ్ముకోలేక ఇండ్లలో పెట్టి నిల్వ ఉంచుకోలేక ఆర్థికంగా నలిగిపోతున్నారని చెప్పారు. కేంద్రం వెంటనే సిసిఐని రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. పత్తికి క్వింటాలుకు రూ.10 వేలు కనీస మద్దతు ధరగా చెల్లించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి బుకాయించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకుండా పత్తికి యేటా రూ.50 నుంచి 100కు పెంచుతూ రైతులను ఏ మార్చడం శోచనీయమని అన్నారు. మహారాష్ట్రలో చెల్లిస్తున్న రేట్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా కేంద్రం సిసిఐనీ రంగంలోకి దింపి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, మామిడి స్వామి, ధోని వెంకన్న, ఆర్.మంజుల, పెర్క దేవిదాస్, సుమన్‌తాయి, దిలీప్, రైతులు పాల్గొన్నారు.